
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు
జిల్లా వార్తలు 5

ఆదివారం 10 నవంబరు 2024



శ్రీశైలానికి సీప్లేన్





సీ ప్లేన్ నుంచి బయటకు వస్తున్న సీఎం చంద్రబాబు

- విజయవాడ నుంచి తొలి సర్వీసు
- మొదటి ప్రయాణం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు

నంద్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఓ అద్భుత ఘట్టానికి వేదికగా నిలిచింది. అధునాతన టెక్నాలజీతో కూడిన సీ ప్లేన్ ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. ఇక మీదట మల్లన్న సన్నిధికి చేరుకునే భక్తులకు ప్రయాణం వేగవంతం, సులభతరం కానుంది. శనివారం విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ నుంచి ఎగిరిన సీ ప్లేన్ శ్రీశైలం జలాశయం బ్యాక్ వాటర్‌పై మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ల్యాండ్ అయింది. నీటిని చిమ్ముకుంటూ.. చీల్చుకుంటూ వచ్చిన సీ ప్లేన్ జెట్టీ దగ్గర ఆగింది. ఈ దృశ్యాన్ని చూసిన ప్రజాప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



ఇది రాష్ట్రంలోనే మొదటి సీ ప్లేన్ సర్వీసు కాగా ఇందులో ప్రయాణించిన మొదటి వ్యక్తి సీఎం చంద్రబాబు నాయుడు. సీప్లేన్‌లో 40 నిమిషాల్లోనే విజయవాడ నుంచి శ్రీశైలానికి చేరుకోవచ్చు. ప్రస్తుత ట్రయల్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న సీ ప్లేన్ సర్వీసు మార్చి నుంచి అందుబాటులోకి రానుంది.

వివరాలు 7లో..




ముఖ్యమంత్రికి స్వాగతం



సీ ప్లేన్‌లో చంద్రబాబు



ఆశీర్వచనాలు అందిస్తున్న అర్చకులు



శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను చీల్చుకుంటూ వస్తున్న సీ ప్లేన్

న్యూస్ బాక్స్

వీఆర్‌కు ఆలూరు సీఐ

విధుల్లో చేరిన నాలుగు నెలలకే చర్యలు



శ్రీనివాస నాయక్

ఆలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్‌ను వీఆర్‌లోకి పంపుతూ పోలీసు శాఖ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. పేకాటను నియంత్రించడంలో విఫలం కావడం వల్లే చర్యలు తీసుకున్నట్లు పోలీసు వర్గాల సమాచారం. అంతేగాకుండా సివిల్ పంచాయితీలు చేస్తూ ఒక వర్గానికే వత్తాసు పలికారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఈ మేరకు విధుల్లో చేరిన నాలుగు నెలలకే శ్రీనివాస నాయక్‌పై చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. అన్నమయ్య జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐగా ఉన్న వెంకట చలపతిను ఆలూరు సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ కూడా..

నందికొట్కూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణ నందికొట్కూరు పట్టణ స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ప్రతాప్‌ను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. కొంత కాలంగా ఎస్బీలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ప్రతాప్‌పై సొంత పోలీసు శాఖతోపాటు నియోజకవర్గ నాయకుల నుంచి పలు ఫిర్యాదులు ఎస్పీకి వెళ్లడంతో ఆయన విచారించి వీఆర్‌కు పంపినట్లు తెలుస్తోంది.



కొమరోలులో భూములను పరిశీలిస్తున్న అధికారులు

ఓర్వకల్లులో డ్రోన్ హబ్‌కు 300 ఎకరాలు

స్థలాలను పరిశీలించిన డ్రోన్ కార్పొరేషన్ సీఎండీ కె.దినేష్ కుమార్ 6

యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం

దేవనకొండలో పలు పార్టీల తీర్మానం 6

గర్భాశయ క్యాన్సర్‌కు హెచ్‌పీవీ వ్యాక్సిన్

కర్నూలులో ప్రారంభమైన జాతీయ గైనిక్ వైద్యుల సదస్సు 7

అడవిని కాపాడిన అమరులు

నేడు జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం 6లో

విద్యాభ్యాసనకు భాష అడ్డంకి కాకూడదు

- జాయింట్ కలెక్టర్ బి. నవ్య
- ఘనంగా ఉర్దూ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

కర్నూలు అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యాభ్యాసనకు భాష అడ్డంకి కాకూడదని జాయింట్ కలెక్టర్ బి. నవ్య అన్నారు. శనివారం నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ 8వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ పీఎస్ షావలి, పాలక మండలి సభ్యురాలు అజ్రాజావేద్, రిజిస్ట్రార్ లోక్‌నాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ భాషా అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు కర్నూల్లో వర్సిటీ ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం పీజీ, డిగ్రీ కోర్సులు నిర్వహిస్తున్నారని, అందులో బాలికలు అధిక సంఖ్యలో చదువుకోవడం మంచి పరిణామం అన్నారు. పాలక మండలి సభ్యురాలు అజ్రాజావేద్ మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగంలో ఉన్నత హోదాలో మహిళలు ఉండటం స్త్రీ శక్తి అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ పీఎస్ షావలి మాట్లాడుతూ ఓర్వకల్లులో యూనివర్సిటీ నిర్మాణానికి సంబంధించి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి కావాల్సిన భూస్థల సేకరణ తుది దశలో ఉందన్నారు. అనంతరం క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు జేఎండీ ఇబ్రహీం, నవీద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ఎస్పీ జి.బిందుమాధవ్
- ట్రాఫిక్ అవేర్‌నెస్ కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం



ఆటో డ్రైవర్లు, ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ జి.బిందుమాధవ్

కర్నూలు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. శనివారం కొత్తపేట సమీపంలో ఆధునికీకరించిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్‌పై అవగాహన, కౌన్సెలింగ్ సెంటర్‌ను ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కర్నూలులో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ప్రమాదాలను తగ్గించేందుకు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా సజావుగా సాగేందుకు ఆటోడ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఆటోలను నిర్ణీత ప్రాంతాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలన్నారు. మైనర్లు వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయని తెలిపారు. ప్రతి ఆటోకు పోలీసు గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, నేరాలను అరికట్టడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు జరిగినా డయల్ 112కు గానీ, డయల్ 100కు గానీ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ జే బాబు ప్రసాద్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, సీఐలు రామయ్య నాయుడు, నాగరాజారావు, మురళీధర్ రెడ్డి, మధుసూదన్ గౌడు, పవన్ కుమార్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ హుసేన్, ఆటో యూనియన్ సంఘాలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కుడా ఛైర్మన్‌గా సోమిశెట్టి

- విధేయతకు రెండోసారి అవకాశం
- వాల్మీకి/బోయ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బొజ్జమ్మ
- కురుబ కార్పొరేషన్‌కు దేవేంద్రప్ప
- ముస్తాక్ అహ్మద్‌కు స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్
- బీజేపీ కోటాలో న్యాయవాది సావిత్రికి రజక కార్పొరేషన్





కప్పట్రాళ్ల బొజ్జమ్మ



దేవేంద్రప్ప



ముస్తాక్ అహ్మద్



సావిత్రి

కర్నూలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శనివారం ప్రభుత్వం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు ప్రాధాన్యం లభించింది. నలుగురికి కీలక పదవులు దక్కడంతో టీడీపీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లును కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్మన్ పదవి రెండో పర్యాయం వరించింది. కర్నూలు జిల్లాలో ఆలూరు నియోజకవర్గం దేవనకొండ మండలానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కప్పట్రాళ్ల బొజ్జమ్మకు ఏపీ వాల్మీకి/బోయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, బీజేపీ కోటాలో ఆదోనికి చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సావిత్రికి రజక కార్పొరేషన్ కేటాయించారు. ఆదోని నియోజకవర్గం నుంచి టీడీపీ సీనియర్ నాయకుడు, ఆదోని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పెద్దహరివాణం దేవేంద్రప్పకు కురుబ/కురుమ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ దక్కగా నంద్యాల జిల్లా నుంచి నంద్యాల పట్టణానికి చెందిన టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు ముస్తాక్ అహ్మద్‌కు ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కేటాయించారు. ఇదిలా ఉండగా గత ఎన్నికల్లో పొత్తు, సామాజిక సమీకరణాల్లో భాగంగా సీట్లు త్యాగం చేసిన మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డిలకు మళ్లీ నిరాశే మిగిలింది. అయితే అసెంబ్లీ సమావేశాలు తరువాత నామినేటెడ్ పదవులకు సంబంధించి మూడో జాబితా ప్రకటించే అవకాశం ఉంది. సీట్లు త్యాగం చేసిన నేతలు, పార్టీ గెలుపు కోసం కష్టపడిన నాయకులకు అవకాశం ఉంటుందని రాష్ట్ర నాయకత్వం స్పష్టం చేసినట్లు సమాచారం.

విధేయతకు మళ్లీ అవకాశం

టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి, అధినేత చంద్రబాబుకు విధేయుడుగా కొనసాగుతున్న పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లును రెండవసారి కుడా ఛైర్మన్ పీఠం కేటాయించారు. 1982లో హైదరాబాద్ నిజాం గ్రౌండ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో.. ప్రభంజనంలా తరలివచ్చిన జనం మధ్య ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ప్రకటించారు. ఆ వేదికపైనే పలువురు నాయకులకు టీడీపీ సభ్యత్వం ఇచ్చారు. కర్నూలు జిల్లా నుంచి పార్టీ ఆవిర్భావం రోజున సభ్యత్వం తీసుకున్న వారిలో దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి, శేగు వెంకటరమణ, ఉచ్చప్ప, వెంకటస్వామితో పాటు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బీవీ రెడ్డిలు ఎన్టీఆర్ సమక్షంలో టీడీపీ చేరారు. ఆయన చేతులు మీదుగా సభ్యత్వం తీసుకున్నారు. ఆనాటి నుంచి టీడీపీలోనే కొనసాగుతూ నాడు టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, నేడు అధినేత చంద్రబాబులకు అత్యంత సన్నిహితుడుగా ఉంటూ వస్తున్నారు. 25 ఏళ్లపాటు ఉమ్మడి కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2017లో కుడా తొలి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడం, అధినేత చంద్రబాబు మరోసారి అవకాశం ఇవ్వడంతో ఆ పదవి రెండవ పర్యాయం కూడా వరించింది. ఈ పీఠం కోసం టీడీపీ సీనియర్ నాయకులు పలువురు పోటీ పడినా అధినేత చంద్రబాబు సోమిశెట్టి వైపే మొగ్గుచూపారు.

మిగతా 6లో..

ఓర్వకల్లులో డ్రోన్ హబ్‌కు

300 ఎకరాలు

స్థలాలను పరిశీలించిన డ్రోన్ కార్పొరేషన్ సీఎండీ కె.దినేష్ కుమార్



పాలకొలనులో మ్యాప్‌ను పరిశీలిస్తున్న డ్రోన్ కార్పొరేషన్ సీఎండీ

ఓర్వకల్లు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో 300 ఎకరాల స్థలంలో డ్రోన్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు డ్రోన్ కార్పొరేషన్ సీఎండీ కె.దినేష్ కుమార్ వెల్లడించారు. ఓర్వకల్లు ప్రాంతాన్ని డ్రోన్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇటీవల కేబినేట్ సమావేశంలో వెల్లడించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ ప్రాంతంలో డ్రోన్ హబ్ ఏర్పాటుకు సంబంధించిన స్థలాలను దినేష్ కుమార్ శనివారం పరిశీలించారు. ఆయనతో పాటు జీఎం జి.సురేష్, పి. ప్రవీణ్ కుమార్, మణికుమార్, డీఎఫ్ఐలు స్విట్హా సిరిస్‌జోషీ డ్రోన్ ఆచార్య శుభంగి జోహాన్ రాజజనార్దన్, ఆర్డీవో సందీప్ కుమార్‌తో పాటు పది మంది సిబ్బంది ప్రభుత్వ పొలాలను పరిశీలించారు. ఓర్వకల్లు, పాలకొలను, కొమరోలు, చింతపల్లె, సోమయాజులపల్లెలో అనువైన భూములను స్థానిక రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. చింతపల్లె గ్రామం వద్ద పాలకొలను, కొమరోలు వద్ద కొన్ని భూములు డ్రోన్ హబ్ ఏర్పాటుకు అనువుగా ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ భూమి 600 ఎకరాలు ఉందని, అందులో 400 ఎకరాలు డ్రోన్ ఏర్పాటుకు భూములు అనుకూలంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. రెండు గ్రామాల మధ్య అధికారులతో సీఎండీ దినేష్ కుమార్ మ్యాప్‌ను పరిశీలించారు. రూ.1000 కోట్ల పెట్టుబడులతో డ్రోన్ పాలసీ-2024, 2029 ఏపీ డ్రోన్ కార్పొరేషన్ రూపొందించిందన్నారు. డ్రోన్ రంగంలో 40వేల ఉద్యోగాల కల్పన రూ.3వేల కోట్ల రాబడి లక్ష్యంగా కేబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. దీంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సాధ్యమైనంత త్వరగా స్థల సేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థల సేకరణలో ఎలాంటి అలసత్వం లేకుండా అదికారులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, ఆర్ఐ పాణ్యం వెంకటేశ్వర్లు, సర్వేయర్ శంకర్‌శర్మ, సర్పంచ్‌లు చదువుల సుజాతమ్మ, వెంకటరమణ, టీడీపీ సీనియర్ నాయకులు పాలకొలను చదువుల సుధాకర్ రెడ్డి, కొమరోలు, పాలకొలను వీఆర్వోలు, గ్రామ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆర్టీజీఎస్ కేంద్రం పరిశీలన

రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ జిల్లా సెంటర్ నిర్మాణ పనులను ఆర్టీజీఎస్ సీఈఓ కె.దినేష్ కుమార్ పరిశీలించారు. ఆర్టీజీఎస్ కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వం ప్రతి జిల్లాలోనూ కలెక్టరేట్‌కు అనుసంధానంగా ఒక ప్రత్యేక ఆర్టీజీఎస్ జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోందని తెలిపారు. దీంతో ఆయా జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, ఈవెంట్స్, సంఘటనలను రియల్ టైమ్‌లో పరిశీలించి సమీక్షించే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా ఏపీ ఫైబర్ నెట్ కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఫైబర్ నెట్ విస్తరణ పనులను అధికారులతో సమీక్ష నిర్వహించారు.

దైవిక చిహ్నం.. ధార్మిక మార్గం


- 105 ఏళ్ల కోల్స్ చర్చి
- అప్పట్లోనే నిర్మాణ వ్యయం రూ.60 వేలు
- నేటికీ చెక్కు చెదరని చారిత్రాత్మక కట్టడం

ఆధ్యాత్మికం



కర్నూలు కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):

ఆకాశ హర్మ్యాన్ని అంటే వంద అడుగుల ఎత్తైన శిఖరం... శిఖర భాగంలో కాలచక్రాన్ని చూపే గడియారం... గోదిక్ నమూనాలో సుందరంగా కనిపించే ఆర్చ్‌లు.. అందమైన రోజ్‌వుడ్ చెక్కలతో చేసిన కిటికీలు... ప్రత్యేకమైన గదులతో ఆకర్షణీయంగా కనిపించే ఈ క్రైస్తవ ప్రార్థనా మందిరమే కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి. కర్నూలు నగరంలో ప్రత్యేక కట్టడంగా కనిపించే ఈ దైవిక చిహ్నం, అనునిత్యం ధార్మిక భావనలు వెదజల్లుతూ క్రైస్తవులకు ఆరాధ్య, ఆధ్యాత్మిక కేంద్రంగా అలరాలుతోంది. 105 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ చర్చిని అమెరికాకు చెందిన అక్కర్‌మన్ కోల్స్ నిర్మించారు. అందుకే ఆయన పేరు స్ఫురించేలా ఈ మందిరానికి కోల్స్ చర్చిగా నామకరణం చేశారు.



రెవ. డాక్టర్ విలియం ఆర్థర్ స్టాంటన్ (ఫైల్)


నిర్మాణానికి రూ.60వేలు

అమెరికా బాప్టిస్టు మిషనరీకి చెందిన రెవ. విలియం ఆర్థర్ స్టాంటన్ 1918కి పూర్వం జిల్లాలో మిషనరీ సేవలు అందించేందుకు వచ్చారు. ఇక్కడ క్రైస్తవ విశ్వాసులు ఆరాధించుకునేందుకు, క్రీస్తు సువార్త పరిచర్యకు కేంద్రం ఉండాలని ఒక చర్చి స్థాపించేందుకు అమెరికాలో వైద్యవృత్తిలో ఉన్న మిత్రుడు డాక్టర్ అక్కర్‌మన్ కోల్స్‌ను సంప్రదించాడు. దీంతో కోల్స్ పాఠశాలకు ఎదురుగా, ప్రధాన రహదారిలోని స్థలాన్ని ఆనాడు రూ.4500లకు స్టాంటన్ దొర కొనుగోలు చేశారు. అనేక మంది సర్వమతస్తుల మధ్య 1917 సెప్టెంబరు 3న నాటి సీనియర్ మిషనరీ అయిన డాక్టర్ జాన్ న్యూకూంబ్‌చేత పునాదిరాయి వేయించారు. ప్రపంచ యుద్ధం కారణంగా చర్చి నిర్మాణం నిదానంగా జరిగి 1919 సెప్టెంబరు 21న నాటికి పూర్తయింది. కర్నూలు సున్నపురాయితో నిర్మించిన ఈ ఆలయ నిర్మాణానిక రూ.60 వేలు ఖర్చు అయింది. ఈ చర్చిలో శిఖర భాగంలో ఆనాడు అమెరికా నుంచీ కోల్స్ దొర పంపించిన గడియారం, గుడి గంట నేటికీ వినియోగంలో ఉండటం విశేషం.





నిరంతర సేవా కార్యక్రమాలకు నిలయం



కోల్స్ చర్చి నిరంతర సేవా కార్యక్రమాలకు నిలయంగా ఉంటుంది. ఇక్కడ యువతకు యూత్ వింగ్, మహిళలకు విమన్స్ వింగ్, పిల్లల కోసం సండే స్కూల్ వంటివి కొనసాగుతున్నాయి. అలాగే ప్రతీవారం ఉచిత వైద్య పరీక్షల కేంద్రం అందుబాటులో ఉంటుంది. వివిధ గ్రామాలలోని చర్చిలకు ఆర్థిక సహాయంతోపాటూ, కొత్త చర్చిల నిర్మాణాలకు ఆర్థిక సహాయం చేయడం, అక్కడ పాస్టర్లను నియమించి వారికి వేతనాలు చెల్లించడం చేస్తున్నాం.

- అబ్రహాం లింకన్, అధ్యక్షుడు, కోల్స్ చర్చి

కోల్స్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు



కోల్స్ చర్చి నిర్మాణ దాత కోల్స్ పేరున కోల్స్ ఫౌండేషన్ సంస్థ స్థాపించి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. రాక్‌వుడ్, ఈసీఎం, కోల్స్ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి, వాటర్ బాటిళ్లు, చలికాలంలో స్వెటర్లు, పేద మహిళలకు కుట్టు మిషన్లు, దివ్యాంగులకు ట్రై సైకిళ్ల వంటివి అందించడం ఏటా కొనసాగుతూ ఉంటాయి. కోల్స్ మహనీయుని స్ఫూర్తిగా, కోల్స్ చర్చి అనుబంధంగా ఈ సంస్థ సేవల్లో ముందుంటోంది.

- పి.విజయ్‌కుమార్, అధ్యక్షుడు, కోల్స్ ఫౌండేషన్ సంస్థ

అడవిని కాపాడిన అమరులు

- విధి నిర్వహణలో అశువులు బాసిన ఫారెస్టు ఉద్యోగులు
- నేడు జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం



అమరుల స్మారక స్థూపానికి అటవీ అధికారుల నివాళి

ఆత్మకూరు, నవంబరు 9:



ఒకప్పుడు అటవీ ఉద్యోగులకు ఆయుధాలు ఉండేవికావు. దీంతో విధుల నిర్వహణ కత్తిమీద సాములా ఉండేది. కానీ నాలుగేళ్ల క్రితం అటవీశాఖలో పనిచేసే రేంజర్, ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌బీవో స్థాయి అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆయుధాలు ఇచ్చింది. దీంతో కాస్త ఊరట లభించింది. ఆయుధాలు చేతిలో లేనప్పుడు పలువురు అటవీ ఉద్యోగులు స్మగ్లర్ల చేతుల్లో హతులయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం కోటిపల్లికి చెందిన ఐఎఫ్ఎస్ అధికారి పందిళ్లపల్లి శ్రీనివాస్ కర్నాటక క్యాడర్‌లో విధులు నిర్వహిస్తూ అక్రమ కలప నివారణ, వన్యప్రాణుల వేట కట్టడికి నూతన విధానాలకు శ్రీకారం చుట్టారు. అంతటితో కాకుండా అటవీ సమీప గ్రామాల్లో ఆసుపత్రులు, పాఠశాలలు, రహదారులు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకై చొరవ తీసుకోవడంతో ప్రజల్లో మంచి గుర్తింపు ఉండేంది. ఈ క్రమంలోనే తమ స్మగ్లింగ్‌కు ఐఎఫ్ఐ పందిల్లపల్లి శ్రీనివాస్‌గా అడ్డుగా ఉన్నారని 1991, నవంబరు 10వ తేదిన స్మగ్లర్ వీరప్పన్ తన అనుచరులతో కలిసి ఆయన్ని హతమార్చారు. అయితే అటవీ రక్షణకై విశేష సేవలు అందించి అశువులు బాసిన పందిళ్లపల్లి శ్రీనివాస్‌ను స్మరిస్తూ.. 1992 నుంచి నవంబర్ 10వ తేదిన జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మరణాంతరం 1992లో కేంద్ర ప్రభుత్వం కీర్తిచక్ర అవార్డుతో ఆయనను గౌరవించింది.

వనం- మనం నేటి సమాజంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన నినాదం. అడవులు లేకుంటే మానవాళి లేదు. పర్యావరణం లేదు. అడవుల రక్షణలో సంరక్షణలో ప్రతిఒక్కరిని భాగస్వాముల్ని చేయాలన్న సంకల్పంతో స్వచ్ఛందసంస్థలు, ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ప్రత్యేకించి వనాల, వన్యప్రాణుల సంరక్షణలో అటవీశాఖ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అడవితల్లి రక్షణకై ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించినవారి అమరత్వాన్ని ప్రతి ఏటా నవంబర్ 10న గుర్తు చేసుకుంటారు.

జిల్లాలో అమరుడైన రేంజర్ రామయ్య



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 21 మంది అటవీ ఉద్యోగులు విధినిర్వహణలో అమరులయ్యారు. ఆత్మకూరు అటవీ డివిజన్‌కు చెందిన బైర్లూటి రేంజ్ అధికారి రామయ్య 1994 జూన్ 20వ తేదిన మావోయిస్టుల చేతిలో హత్యకు గురయ్యారు. విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించడంతో ఆయన్ని కాల్చిచంపినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత పలు సందర్భాల్లో అటవీ సిబ్బందిపై దాడులు చేసిన సంఘటనలు లేకపోలేదు. కలప స్మగ్లర్లను అదుపులోకి తీసుకునే క్రమంలో అనేకమార్లు పోలపర్లు రాళ్లదాడులకు పాల్పడ్డారు. అయితే అప్పట్లో అటవీ అధికారుల చేతుల్లో ఆయుధాలు లేకపోవడంతో ఈ సంఘటనలన్ని జరిగినట్లు విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం అటవీ అధికారులకు ఆయుధాలు ఇవ్వడంతో విధుల్లో రాణించేందుకు అవకాశం వుంది. కాగా రేంజర్ రామయ్య ప్రాణ త్యాగానికి గుర్తుగా ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని బైర్లూటిలో ఏర్పాటు చేసిన స్మారక స్థూపం వద్ద ప్రతి ఏటా అటవీ అమరుల దినోత్సవం సందర్భంగా ఆయనకు నివాళ్లు అర్పిస్తారు.

అటవీ అమరవీరుల త్యాగం మరువలేనిది



అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి. విధి నిర్వహణలో అశువులుబాసిన అటవీ ఉద్యోగుల సేవలు మాకు ఆదర్శం. అటవీ రక్షణకై విధులు నిర్వహించే ఉద్యోగులకు ఆయుధాలను సమకూర్చడం సంతోషదాయకం. అలాగే అటవీ ఉద్యోగుల విధి నిర్వహణకు మరిన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలి.

- సయ్యద్ మగ్బూల్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్



'యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం'

దేవనకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా నాయకుడు వీరశేఖర్, టీడీపీ నాయకులు మాలిక్‌బాషా, వీరేష్, మల్లికార్జునగౌడ్ , సీపీఐ మండల కార్యదర్శి నర్సారావు, కాంగ్రెస్ నాయకులు మహేంద్ర, అన్నారు. శనివారం దేవనకొండలోని మూగితాత ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. యురేనియం అలజడితో ప్రజలు భయంబ్రాంతులకు గురవుతున్నారన్నారు. కలెక్టర్ ప్రకటనలో స్పష్టత లేదన్నారు. మండలానికి వచ్చి ప్రజలకు తవ్వకాల అనుమతులను రద్దు చేశామని చెప్పాలన్నారు. యురేనియం అనుమతులు రద్దు అయ్యేంతవరకు ప్రజలను సమీకరించి మండలంలో ఐక్య పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో చెల్లెలచెలిమల సర్పంచ్ చిన్నరామప్ప, సీపీఎం నాయకులు యూసఫ్‌బాషా, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన వివిధ రాజకీయ పార్టీల నాయకులు

కుడా చైర్మన్‌గా సోమిశెట్టి

5వ పేజీ తరువాయి

ఉమ్మడి జిల్లాలో నామినేటెడ్ పదవులు దక్కించుకున్న వాల్మీకి/బోయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, కురుబ/కురుమ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పెద్దహరివాణం దేవేంద్రప్ప, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్ అహ్మద్‌లకు సామాజికవర్గం కలసి వచ్చింది. వాల్మీకి సామాజికవర్గానికి చెందిన కప్పట్రాళ్ల బొజ్జమ్మ పత్తికొండ సమితి దివంగత మాజీ అధ్యక్షుడు కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడు కుమార్తె. ఆయన మరణాంతరం తండ్రి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారు. ఆస్పరి జడ్పీటీసీగా పని చేశారు. గత ఎన్నికల్లో వాల్మీకి కోటాలో ఆలూరు వైసీపీ టికెట్ ఆశించి నాటి సీఎం జగన్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అయితే.. జగన్ మొండి చేయి చూపడంతో ఆమె భర్త దేవనకొండ మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడుతో కలసి మళ్లీ టీడీపీలో చేరారు. గుర్తించిన సీఎం చంద్రబాబు వాల్మీకి-బోయ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చారు. కురబ సామాజికవర్గానికి చెందిన దేవేంద్రప్ప మొదటి నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. పెద్దహరివాణం సర్పంచిగా, ఆదోని మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా పని చేశారు. గత ఎన్నికల ముందు ఆదోని టీడీపీ టికెట్ ఆశించారు. ఆదోని డివిజన్ ప్రాంతంలో కురబలు అధికంగా ఉన్నారు. దీంతో ఆయనకు కురబ-కురవ కార్పొరేషన్ పదవి దక్కింది. బీజేపీ కోటాలో ఆదోనికి చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది సావిత్రిని రజక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎంపిక చేశారు. చదువుకునే రోజుల్లో ఏబీవీపీ విద్యార్థి సంఘంలో పనిచేశారు. ఆ తర్వాత ఆర్ఎస్ఎస్‌లో చురుకైన కార్యకర్తగా పనిచేశారు. ఎన్నికల సమయంలో బీజేపీలో చేరారు. కాగా సావిత్రి భర్త నాగరాజు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ.. ఎస్టీయూ రాష్ట్ర నాయకుడిగా ఉన్నారు. నంద్యాల పట్టణంలో ముస్లీం మైనార్టీలు అధికంగా ఉన్నారు. ఆ సామాజికవర్గానికి చెందిన ముస్తాక్ అహ్మద్‌కు ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఇచ్చారు. నామినేటెడ్ పదవులు దక్కిన నేతలను అభిమానులు, కార్యకర్తలు కలసి అభినందనలు తెలియజేశారు.

ఆ ఇద్దరు నేతలకు నిరాశ



తిక్కారెడ్డి




మీనాక్షి నాయుడు

టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు వై.సాయిప్రసాదరెడ్డి, బాలనాగిరెడ్డిలను టీడీపీ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, పి.తిక్కారెడ్డిలు దీటుగా ఎదుర్కొన్నారు. కార్యకర్తలకు అండగా నిలిచారు. ఆదోనిలో నిర్వహించిన బాదుడే బాదుడు రోడ్ షో దిగ్విజయం చేసి మీనాక్షినాయుడు రాష్ట్రంలోనే టీడీపీ శ్రేణుల్లో సరికొత్త నూతనోత్తేజం తీసుకొచ్చారని అధినేత చంద్రబాబు మహానాడు వేదికగానే ప్రశంసించారు. యువగళం పాదయాత్ర ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో దిగ్విజయం చేయడం, అధినేత అక్రమ అరెస్టుతో 53 రోజులు అక్రమంగా జైలు నిర్బంధంలో ఉంటే వివిధ రూపాల్లో అందోళన, నిరసనలతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో మీనాక్షినాయుడు, తిక్కారెడ్డి వారి కుటుంబ సభ్యుల కృషి ఎంతో ఉంది. గత ఎన్నికల్లో మరోసారి ఆయా నియోజకవర్గాల్లో వారే పోటీ చేస్తారని అధిష్టానం సంకేతాలు కూడా ఇచ్చింది. అయితే పొత్తుల్లో భాగంగా కె.మీనాక్షినాయుడు ఆదోని టికెట్, సామాజిక సమీకరణాల్లో భాగంగా మంత్రాలయం టికెట్ తిక్కారెడ్డి త్యాగం చేయాల్సి వచ్చింది. 'వీరి రాజకీయ భవిష్యత్తు నాది.. అధికారం చేపట్టగానే తొలి జాబితాలోనే నామినేటెడ్ పదవులు ఇస్తా'నని అధినేత చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. జిల్లా పార్టీలోనే అత్యంత సీనియర్ నాయకుడైన కె.మీనాక్షినాయుడుకు సముచిత స్థానం కల్పిస్తానని ఎన్నికల ముందు ఆలూరు ప్రజాగళం ప్రచార సభకు హాజరైన చంద్రబాబు బస్సులో దాదాపు అరగంటకు పైగా చర్చించి స్పష్టమైన హామీ ఇచ్చారు. నామినేటెడ్ పదవులు రెండు జాబితాలు విడుదల చేసినా సీట్లు త్యాగం చేసిన వీరిద్దరికి నిరాశే మిగిలింది.

పర్యాటక రంగానికి శ్రీశైలం అనుకూలం

● సీప్లేన్ డెమో ప్రారంభించిన సీఎం చంద్రబాబు ● పర్యాటక అభివృద్ధికి మాస్టర్ ప్లాన్



'పర్యాటక రంగానికి శ్రీశైలం అనుకూల ప్రదేశం. ఇక్కడి తుమ్మలబయలులో టైగర్ సఫారికి అవకాశం ఉంది. వన్యప్రాణులు, పులులు, చిరుతలకు నల్లమల అభయారణ్యం సురక్షిత ప్రదేశం. ఇక శ్రీశైలం డ్యాం ఒక అద్భుతం. డ్యాం గేట్లు ఎత్తినప్పుడు ఆ దృశ్యాలను చూడటానికి ప్రజలు ఎక్కువ మంది వస్తుంటారు. ఇక్కడి ప్రసిద్ధి చెందిన అక్కమహాదేవి గుహల్లో ట్రెక్కింగ్, ధ్యానం చేసుకోవడానికి అనువుగా ఉంటుంది. ఇష్ట కామేశ్వరి దేవి, సాక్షి గణపతి క్షేత్రాలు కూడా ఉన్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తాం.'

- సీఎం చంద్రబాబు నాయుడు

శ్రీశైలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాంతం తిరుమల తిరుపతి పవిత్ర పుణ్యక్షేత్రంలాగే పచ్చని ప్రకృతితో నిండి ఉందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. దోర్నాల నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు ఉంది కాబట్టి టూరిజాన్ని అభివృద్ధి పరిచేలా అనేక రకాల కార్యక్రమాలను చేపట్టవచ్చన్నారు. అలాగే తుమ్మలబయలులో నల్లమల జంగిల్ సఫారీ, టైగర్ రిజర్వ్‌లో టైగర్ సఫారి చేయవచ్చన్నారు. పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు ఓ మాస్టర్ ప్లాన్ తయారు చేస్తామన్నారు. కమిటీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా పనులు చేపడతామన్నారు.

శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం సీఎం నారా చంద్రబాబు నాయుడు దర్శించుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'సీ మీట్స్ స్కై' పేరుతో చేపట్టిన విజయవాడ-శ్రీశైలం మధ్య సీప్లేన్ సర్వీసును శనివారం ఉదయం విజయవాడ పున్నమి ఘాట్ వద్ద లాంఛనంగా ప్రారంభించారు. తరువాత సీప్లేన్ ద్వారా శ్రీశైలం పాతాళగంగ ల్యాండింగ్ పాయింట్‌కు వచ్చారు. అక్కడి నుంచి రోప్ వే ద్వారా ఎంట్రీ పాయింట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి కాన్వాయ్ ద్వారా స్వామి, అమ్మవార్ల ప్రధానాలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్దకు చేరుకున్నారు. దర్శనార్థం ప్రధానాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనరు ఎస్. సత్యనారాయణ పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు బ్యాటరీ వాహనంలో ఆలయ రాజగోపురానికి చేరుకోగా ఆలయ అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తరువాత ఆయన స్వామివారి ఆలయ ప్రాంగణంలోని రత్న గర్భగణపతి స్వామిని



శ్రీశైలం దేవస్థానంలో చంద్రబాబు పూజలు

దర్శించుకుని మల్లికార్జున స్వామివారికి అభిషేకం చేశారు. స్వామివారి దర్శనానంతం సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్నారు. ఆ తరువాత భ్రమరాంబికాదేవి అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ముఖ్యమంత్రి చంద్రబాబును అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, ఎంపీలు, బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు గౌరు చరిత, గిత్తా జయసూర్య, జయనాగేశ్వరరెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, శ్రీశైలం ఆలయం ఇన్‌చార్జి ఈవో ఇ.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలం బ్యాక్ వాటర్‌పై సీ ప్లేన్



ఆలయ అధికారులు, అర్చకులతో సీఎం చంద్రబాబు నాయుడు

మల్లన్న సేవలో చంద్రన్న

● శ్రీశైలంలో సీఎంకు ఘన స్వాగతం

● స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న చంద్రబాబు

శ్రీశైలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం సీఎం నారా చంద్రబాబు నాయుడు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల ప్రధానాలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనరు ఎస్. సత్యనారాయణ పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు బ్యాటరీ వాహనంలో ఆలయ రాజగోపురానికి చేరుకోగా ఆలయ అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తరువాత ఆయన స్వామివారి ఆలయ ప్రాంగణంలోని రత్న గర్భగణపతి స్వామిని దర్శించుకుని మల్లికార్జున స్వామివారికి అభిషేకం చేశారు. స్వామివారి దర్శనానంతం సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్నారు. ఆ తరువాత భ్రమరాంబికాదేవి అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. దర్శన అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో చంద్రబాబును అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, స్వామి, అమ్మవార్ల ప్రసాదాలను అందించారు. సీఎం చంద్రబాబు వెంట రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు తదితరులు ఉన్నారు.



చంద్రబాబుతో బుడ్డా



పాతాళగంగ వద్దకు చేరుకున్న సీ ప్లేన్



స్వామివారి ప్రసాదం స్వీకరిస్తున్న చంద్రబాబు



పాతాళగంగకు వెళ్లే మెట్ల వద్ద చంద్రబాబు

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

ఓర్వకల్లు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లొద్ది పల్లె గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు రెడ్డిపోగు సంతోష్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోయ ఆనంద్ ఆటోను అతివేగంగా నడిపి రోడ్డు దాటున్న లొద్దిపల్లె గ్రామానికి చెందిన బాలుడు సంతోష్‌ను ఢీకొంది. దీంతో బాలుడు రక్తగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని పశ్చిమ బెంగాల్ వాసి..

నందికొట్కూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన సందీప్ టక్కీ(30) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన టక్కీ 340సి జాతీయర రహదారి పనులు చేసేందుకు గత కొన్ని రోజుల క్రితం నందికొట్కూరుకు వచ్చాడు. శనివారం ఉదయం మార్కెట్ యార్డు వద్ద కేజీ రోడ్డుపై నడిచి వెళ్తున్న సందీప్ టక్కీని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో సందీప్ శరీరం రెండు బాగాలుగా విడిపోయింది. మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సందీప్ స్నేహితుడు ప్రదీప్ కుమార్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రామచంద్రుడు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

బేతంచెర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిమెంటునగర్ గ్రామ సమీపంలో మోటారు బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రమేష్ నాయక్ (25) అనే వ్యక్తి శనివారం మృతి చెందాడు. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన రమేష్ నాయక్ గ్రామంలో టీస్టాల్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవలే రమేష్ నాయక్ కొత్త బైక్ కొన్నాడు. మద్దిలేటి నరసింహస్వామి దగ్గరికి వెళ్లి పూజలు చేయించుకుని స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా.. ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య దేవిబాయి, ఏడాది కూతురు ఉన్నారు. రమేష్ నాయక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. భార్య దేవిబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు.



మృతి చెందిన రమేష్ నాయక్

గూడ్స్ ఢీకొని యువకుడు..

బేతంచెర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్.కొట్టాల రైల్వే గేటు సమీపంలో శనివారం గూడ్స్ రైలు ఢీకొని శ్రీధర్ ఆచారి (19) అనే యువకుడు దుర్మరణం చెందాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామానికి చెందిన వెంకట రమణయ్య ఆచారి, ఇంద్రావతి దంపతులకు చెందిన ఒకే ఒక్క కుమారుడు శ్రీధర్ ఆచారి బేతంచెర్ల పద్మావతి ఐటీఐ కాలేజీలో చదివేవాడు. మొదటి సంవత్సరం పూర్తి చేసి రెండో సంవత్సరం మానేసి ఇంటి దగ్గరే ఉన్నాడు. శనివారం ఉదయం తల్లిదండ్రులు పొలం పనికి వెళ్లారు. శ్రీధర్ ఆచారి బేతంచెర్లకు వచ్చాడు. హెచ్.కొట్టాల రైల్వే గేటు నుంచి డోన్ వైపు రైల్వే ట్రాక్ వెంబడి వెళ్తుండగా నంద్యాల నుంచి డోన్ వైపు వెళ్లే గూడ్స్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు కేసు నమోదు చేసి మృతదేహాన్ని డోన్ రైల్వే ఆసుపత్రికి తరలించామని రైల్వే ఎస్ఐ లక్ష్మన్న నాయక్ తెలిపారు.



శ్రీధర్ ఆచారి (ఫైల్)

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి..

గోనెగండ్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని శనివారం ఓ వ్యక్తి శనివారం మృతి చెందాడు. బెళగల్ మం డలం యనగండ్ల గ్రామా నికి చెందిన తెలుగు వెంకటేష్(49)కు భార్య అంజినమ్మ, ఇద్దరు కుతూళ్లు, కుమారుడు ఉన్నారు. దేవనకొండ మండలం కోటకొండ గ్రామంలో ఓ యజమాని దగ్గర మామిడి తోటలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి స్వగ్రామమైన యనగండ్లకు వెళ్లి తిరిగి కోటకొండకు బైక్‌పై బయలు దేరాడు. గోనెగండ్ల మండలం గాజులదిన్నె ప్రాజెక్టు క్రాస్ రోడ్డు దాటుతుండగా ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో బస్సు ఢీకొట్టింది. దీంతో తెలుగు వెంకటేష్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. తలకు తీవ్రమైన గాయాలై నోరు, చెవుల నుంచి తీవ్ర రక్త స్రావం జరిగింది. 108లో కోడుమూరుకు తరలించగా అప్పటికే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ గుగ్గిళ్ల రమణారెడ్డి పారిపోయారు. మృతుడి కుమారుడు బడేసాబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

30 ఏళ్ల తరువాత సొంతూరికి..

● మతిస్థిమితం లేక తప్పిపోయి నేపాల్ చేరిన ఇమ్మానుయేల్

ఎమ్మిగనూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేక 30 ఏళ్ల క్రితం కన్నవారికి దూరమయ్యాడు. ఎక్కడెక్కడో తిరుగుతూ నేపాల్‌కు చేరుకున్నాడు. అక్కడ మానవీయ సేవా కేంద్ర నిర్వాహకులు చేరదీశారు. ఆశ్రమంలోనే ఉంచుకొని వైద్యం చేయించారు. అతను ఎవరో ఎక్కడి నుంచి వచ్చాడో తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన వాడిగా గుర్తించి పట్టణంలో ఉన్న వేదాస్ స్వచ్ఛంద నిర్వాహకులు సునీల్ కుమార్‌తో మాట్లాడి శనివారం ఎమ్మిగనూరుకు తీసుకొచ్చారు. అయితే కుటుంబ సభ్యులు పట్టణంలో ఎవరూ లేకపోవటంతో వేదాస్ నిర్వాహకులు సునీల్ కుమార్‌కు అప్పగించారు. పట్టణంలోని ఎంబీ యోరుషలేం చర్చికి 1982-90లో పాస్టర్‌గా పని చేసిన రెవరెండ్ ఆదాంకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరిలో చిన్న వాడు ఇమ్మానియేల్. ఈయనకు మతిస్థిమితం లేకపోవటంతో 30 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. కాలగమనంలో పాస్టర్ ఆదాం, ముగ్గురు కుమారులు, కుమార్తె మృతి చెందారు. అయితే ఇమ్మానుయేల్ నేపాల్ రాజధాని కాట్మాండు చేరుకున్నాడు. అక్కడ మానవీయ సేవాశ్రమ నిర్వాహకులు చేరదీశారు. ఐదేళ్లుగా వారి దగ్గరే ఉంచుకొని వైద్యం చేయించి వివరాలను తెలుసుకున్నారు. సొంత ఊరు ఎమ్మిగనూరు కావటంతో పట్టణంలోని వేదాస్ స్వచ్ఛంద సేవాశ్రమం నిర్వాహకులు సునీల్ కుమార్‌తో మాట్లాడి వివరాలు చెప్పారు. ఎమ్మిగనూరు వాసిగా గుర్తించిన ఆశ్రమ ప్రతినిధులు సుమన్‌తోపాటు మరొకరు ఇమ్మానుయేల్‌ను శనివారం ఎమ్మిగనూరుకు తీసుకొచ్చారు. అయితే వారి బంధువులు ఎవరూ లేకపోవటంతో వేదాస్ స్వచ్ఛంద సేవాశ్రమంలో ఉంచుకున్నారు. సునీల్ స్థానికుల ద్వారా ఇమ్మానుయేల్ బంధువుల వివరాలు తెలుసుకున్నాడు. అక్క విక్టోరియా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వటంతో వీడియో కాల్ ద్వారా మాట్లాడి గుర్తుపట్టారు. దీంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఎప్పుడో 30 ఏళ్ల క్రితం తప్పిపోయిన వ్యక్తి తిరిగి రావటంతో వారి కుటుంబ సభ్యులు ఆనందబాష్పాలు రాల్చారు. నేపాల్ నుంచి ఇమ్మానుయేల్‌ను ఎమ్మిగనూరుకు తీసుకొచ్చిన ప్రతినిధులకు ఎంబీ చర్చి, వేదాస్ స్వచ్ఛంద సేవాశ్రమం నిర్వాహకులు రూ. 25 వేలు అందజేశారు. చర్చి కార్యదర్శి భాస్కర్, బాబు, తిమ్మరాజు, పౌల్‌రాజు, ఆనంద్‌రాజు, పాస్టర్ డేవిడ్, సెక్రటరీ ప్రభాకర్, శాంతిరాజులు పాల్గొన్నారు.



వేదాస్ నిర్వాహకులకు ఇమ్మానుయేల్‌ను అప్పగిస్తున్న ప్రతినిధులు

గర్భాశయ క్యాన్సర్‌కు హెచ్‌పీవీ వ్యాక్సిన్

● త్వరలో ఇమ్యూనైజేషన్ తరహా వ్యాక్సిన్

● తల్లుల మరణాల నివారణకు కృషి చేయాలి

● కర్నూలులో ప్రారంభమైన జాతీయ గైనిక్ వైద్యుల సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

కర్నూలు హస్పిటల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ రాకుండా మహిళలకు ప్రభుత్వం ఇమ్యూనైజేషన్ తరహాలో హ్యూమన్ పాపిలోమా హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు జాతీయ గైనిక్ సొసైటీ కార్యదర్శి డా. మాధురీ పటేల్ అన్నారు. శనివారం రాత్రి మౌర్యఇన్ హోటల్‌లో జాతీయ గైనిక్ వైద్యుల సదస్సును ప్రిన్సిపాల్ డా. చిట్టినరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు, అనంతపురం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. మాణిక్యరావు, జాతీయ ఉపాధ్యక్షురాలు డా.షర్మిళ అయ్యావు, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డా.ఎస్. వెంకటరమణ, సెక్రటరీ డా. రాధాలక్ష్మి, గైనిక్ హెచ్‌వోడీ డా. శ్రీలక్ష్మితో ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. డా. మాధురీపటేల్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో దేశంలో సర్వేకల్ క్యాన్సర్‌తో అధిక సంఖ్యలో మహిళలు మరణిస్తున్నారని, అందువల్ల 9 నుంచి 48 సంవత్సరాల వయస్సు ఉన్న ఆడ పిల్లలు, మహిళలు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను తీసుకోవాలన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టి నరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు జాతీయ గైనిక్ వైద్యుల సదస్సు జరగడం అభినందనీయమని అన్నారు.



మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి మాధురి పటేల్

ఇద్దరు దొంగల అరెస్టు

● బంగారు, టీవీ, నగదు స్వాధీనం



నిందితులను చూపుతున్న పోలీసులు

కోవెలకుంట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి బంగారు, టీవీ, నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ హనుమంత నాయక్ తెలిపారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరుపరిచారు. కోవెలకుంట్ల మండలం కంపమల్ల గ్రామానికి చెందిన శ్రీరాముల విజయభాస్కర్, మౌలాలి అనే ఇద్దరు వ్యక్తులు కంపమల్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో దొంగతనాలు చేశారు. పొలం పనులకు వెళ్లిన వాళ్ల ఇండ్ల తాళాలు పగలగొట్టి బంగారు, టీవీ, నగదు ఎత్తుకెళ్లారు. ఇలా గ్రామంలోని నాలుగు ఇళ్లల్లో దొంగతనాలు చేశారు. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామంలో కూడా రెండిళ్లలో దొంగతనాలు చేసి కొంత నగదు ఎత్తుకెళ్లారు. సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి నేతృత్వంలో పోలీసులు శ్రీరాముల విజయభాస్కర్, మౌలాలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి నుంచి 3.5 తులాల బంగారం, 65 వేల నగదు, ఐదు జతల వెండి పట్టీలు, ఒక టీవీ స్వాధీనం చేసుకున్నామని పోలీసులు విలేఖరుల సమావేశంలో తెలిపారు. వీరిని మేజిస్ట్రేట్ రిమాండుకు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

'సుధాకర్‌పై చర్యలు తీసుకోవాలి'

కర్నూలు న్యూసిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేస్తూ 2018లో ఏసీబీకి పట్టుబడిన సగ్గిల సుధాకర్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ నగర పాలక కమిషనర్‌కు లేఖ రాశారు. సుధాకర్ పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పని చేస్తే డిప్యుటేషన్‌పై రెవెన్యూ సెక్షన్‌లో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహించేవారని పేర్కొన్నారు. అయితే ఆయన మీద అవినీతి ఆరోపణలు అధికం కావడంతో ఏసీబీ అధికారులు 2018 ఏప్రిల్ 24లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అప్పటి నుంచి సుధాకర్ సస్పెన్షన్‌లో ఉన్నారు. ఈ క్రమంలో సుధాకర్ మీద ఏమి చర్యలు తీసుకున్నారో తక్షణమే నివేదికలు సమర్పించాలని డైరెక్టర్ కోరారు.

26న దేశవ్యాప్త ఆందోళన



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ 26న తలపెట్టిన దేశవాప్త ఆందోళనకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు పిలుపునిచ్చారు. శనివారం కేకే భవన్‌లో జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10 కేంద్ర కార్మిక సంఘాలు, కిసాన్ సంయుక్త మోర్చా రైతు సంఘాల మహాప్రదర్శన, ధర్నాలు చేపడుతున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ధర్నాను విజయవంతం చేయడానికి గ్రామలు, పట్టణాలలో విస్తృతంగా ప్రచారాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.ఈరన్న, సాయిబాబ, విజయ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

కర్నూలు కల్చరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని వాసవీనగర్‌లోని శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం పార్వతీ సమేత శివలింగ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు లక్ష్మీనారాయణ తెలిపారు. దేవాలయంలో 8వ తేదీ నుంచి శ్రీ పార్వతీ సమేత శివలింగ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం నుంచి విగ్రహాలకు ప్రాతఃకాల పూజతో ప్రతిష్ఠ మహోత్సవాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తా

● బీఆర్‌కే ఫౌండేషన్ సభ్యుడు బొల్లెద్దుల ప్రశాంత్

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలిగిన పేద క్రీడాకారులను ప్రోత్సహిస్తానని బీఆర్‌కే ఫౌండేషన్ సభ్యుడు బొల్లెద్దుల ప్రశాంత్ అన్నారు. శనివారం స్థానిక డీఎస్ఏ క్రీడా మైదానంలో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల షూటింగ్ బాల్ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్‌కే ఫౌండేషన్ మెంబర్ బొల్లెద్దుల ప్రశాంత్ క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. విశిష్ట అతిథిగా ప్రముఖ న్యాయవాది శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు.

కార్తీక మాసంపై ప్రవచన సప్తాహం



ఓర్వకల్లులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న భక్తులు

ఓర్వకల్లు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం విశిష్టతపై ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు ధార్మిక ప్రవచన సప్తాహం నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డా.మల్లు వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓర్వకల్లులోని జీవేశ్వరస్వామి ఆలయంలో కరపత్రాలను, బ్యానర్లను ఆవిష్కరించారు. ప్రముఖ జ్యోతిష్య పండితులు ఫణిశశాంక శర్మ తదితరులు పాల్గొన్నారు.







ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోండి

● జాయింట్ కలెక్టర్ బి. నవ్య

కల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని పాణ్యం రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. శనివారం కల్లూరు మండలంలో రెండు రోజుల ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులతో కలిసి జేసి 151, 152, 153, 154, 155,170, 169, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా చనిపోయిన వారు ఉంటే ఫారం-7 , కొత్త, మార్పులు చేర్పులకు దరఖాస్తులు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, ఎలక్షన్ డీటీ అనురాధ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ బి. నవ్య

'ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి'

కర్నూలు కల్చరల్: యువతతోపాటూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్, కర్నూలు నియోజిక వర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్ రవీంద్రబాబు అన్నారు. శనివారం స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 కార్యక్రమంలో భాగంగా నగరంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు నమోదు, సవరణలు, తొలగింపునకు సంబంధించిన ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. దామోదరం సంజీవయ్య స్కూల్, టౌన్ మోడల్ స్కూల్, ఎ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాల, బుధవారపేటలోని చెట్టు కింద బడి, వడ్డేగేరి, ఎ.క్యాంపు తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను కమిషనర్ పరిశీలించారు. ఈ ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు కొనసాగుతాయని, ప్రజలందరూ వినియోగించుకోవాలని కమిషనర్ సూచించారు.

సి. బెళగల్: ఓటరు నమోదును తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి శనివారం సి.బెళగల్‌లో పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 49 పోలింగ్ కేంద్రాలలో నుండి 31 ఓటరు నమోదు దరఖాస్తులు అందయాన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

30 శాతం నిధులు కేటాయించాలి

● ప్రాథమిక పాఠశాలలను మూసివేయరాదు

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలలను మూసివేయరాదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గూడూరులో యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన జరిగిన స్వర్ణోత్సవ మహాసభలను ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల కాలంలో విద్యను ప్రైవేటీకరించే దిశగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ప్రైవేటీకరణను తప్పనిసరిగా ఉపాధ్యాయులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు గూడూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభా ప్రాంగణంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్, నగర పంచాయతీ మాజీ వైస్ ఛైర్‌పర్సన్ ఇందిరా సుభాషిణి, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, నాయకులు పాల్గొన్నారు



గూడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ముమ్మరంగా సెపక్‌తక్రా పోటీలు



క్రీడాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ బలరాముడు

సి. బెళగల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సి బెళగల్ గురుకుల పాఠశాల అవరణలో నేడు 68వ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా క్రీడా పోటీలు శనివారం ముమ్మరంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడు గురుకుల పాఠశాల పీడీ రాఘవేంద్రాచారి అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పోటీలలో గెలుపు ఓటములు సహజమని అన్నారు. ఈ కార్యక్రమంలో అయా జిల్లాలలో నుండి పీడీలు, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ గోవిందు , మాజీ ఎంపీటీసీలు ధనుంజయుడు, బాలాజి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్‌కు కర్నూలు హాకీ జట్టు



సెమీ ఫైనల్‌కు సాధించిన కర్నూలు హాకీ జట్టు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం అనకాపల్లి జిల్లాలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14 హాకీ టోర్నమెంటులో కర్నూలు జిల్లా జట్టు సెమీ ఫైనల్‌కు ఎంపికైందని హాకీ కర్నూలు కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్ దాసరి సుధీర్, ఈరన్న, రామన్న తెలిపారు. క్వాటర్ ఫైనల్‌లో గుంటూరుపై 2-0 స్కోరుతో విజయం సాధించింది. ఈ విజయం పట్ల కర్నూలు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ గిడ్డయ్య తెలిపారు.

మచ్చలేని నాయకుడు దామోదర మునిస్వామి



మాట్లాడుతున్న దామోదరం రాధాకృష్ణమూర్తి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రివర్యులు దామోదర మునిస్వామి ఒక మచ్చలేని నాయకుడు అని దామోదరం సంజీవయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దామోదరం రాధాకృష్ణమూర్తి అన్నారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని చేనేత భవన్‌లో దామోదరం మునిస్వామి 22వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దామోదరం మునిస్వామి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, ప్రేమ్ కుమార్, మధుసూదన్, శేఖర్, చిరంజీవి, సుంకన్న, పాండు పాల్గొన్నారు.

13న మంగళ కౌశిక ద్వాదశి వేడుకలు



మంగళ కైశిక ద్వాదశి పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

గూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ఈ నెల 13వ తేదీన నాలుగు కేంద్రాలలో మంగళ కౌశిక ద్వాదశి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డా.మల్లు వెంకటరెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచారం మండలి సభ్యుడు దమామ్ సురేష్ తెలిపారు. ఈ నెల 13వ తేదీన గూడూరుతో పాటు పర్ల, నంద్యాల మండలం పొన్నాపురం, ఆళ్లగడ్డలో ఈ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు.

ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక

కర్నూలు అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాజీ అమ్‌తూర్ రహీమ్ ఎంపికయ్యారు. ఈనెల 11న విజయవాడలో నిర్వహించే జాతీయ విద్యాదినోత్సం, నేషనల్ మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రధానోత్సవానికి ఆహ్వానం పంపారు కేంద్ర ప్రభుత్వం మౌలానా అబుల్‌కలాం ఆజాద్ మొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆ రోజును కూడా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ అవార్డులను ఎంపీ ఉర్దూ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ఇవ్వనున్నారు.

నేడు వైకుంఠవాసునికి ఆర్జిత సేవలు

- ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భారీ సెట్టింగులతో ఏర్పాట్లు



వేదిక ఏర్పాటు చేస్తున్న సమితి నిర్వాహకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని సీతారామ కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం 'వైకుంఠవాసుని ఉదయాస్తమయ ఆర్జిత సేవలు' నిర్వహించనున్నారు. దీనికి నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భారీ సెట్టింగులతో ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్తీక మాసంలో తిరుమలకు వెళ్లలేని సామాన్య భక్తులు తిరుమలలో జరిగే కార్యక్రమాలు దర్శించుకునేలా ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజలకు ఇక్కడ ఏర్పాటు చేశారు. హైదరాబాదులోని శ్రీ ఆచార్య పీఠం వేద పండితులు సముద్రాల బ్రదర్స్ నేతృత్వంలో 20 మందికి పైగా అర్చక బృందం ఈ కార్యక్రమానికి విచ్చేశారు.

నేడు సెల్లు పురాణం శతకం ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, ప్రముఖ నాటక దర్శకుడు విద్వాన్ పత్తి ఓబులయ్య రాసిన 'సెల్లు (సెల్‌ఫోన్) పురాణం' శతక గ్రంథం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఉంటుందని కళాక్షేత్రం కార్యదర్శి మహ్మద్ మియా తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, గ్రంథావిష్కర్తగా సత్యసాయి జిల్లా అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ముఖ్య అతిథులుగా పారిశ్రామికవేత్త, బీవీ రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య హాజరవుతారని తెలిపారు.

కుడా ఛైర్మన్ సోమిశెట్టికి అభినందనలు

కర్నూలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుడా ఛైర్మన్‌గా ఎంపికైన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లును ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు అభినందనలతో ముంచెత్తారు. శనివారం సీఎం చంద్రబాబు రాష్ట్రంలో నామినేటెడ్ పదవులు కేటాయించారు. కుడా ఛైర్మన్‌గా సోమిశెట్టికి మరోసారి అవకాశం ఇచ్చారని తెలుసుకున్న టీడీపీ మీడియా జిల్లా ఇన్‌చార్జి నంద్యాల నాగేంద్ర, నగర పార్టీ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, పార్టీ నాయకులు వంశీధర్‌రెడ్డి, ఎస్.అబ్బాస్, పేరపోగు రాజు, ఆదాం, షెక్షావలి టీడీపీ జిల్లా కార్యాలయం చేరుకొని సోమిశెట్టికి పూలబుక్కెలతో సత్కరించారు. నగరపాలక సంస్థ కార్పొరేటర్లు కురువ పరమేశ్ (8వ వార్డు), బి.నవీన్ (9వ వార్డు), నాయకులు కె.శ్రీకాంత్, డి.కృష్ణ, జి.శ్రీధర్, ఆర్.సత్య తదితరులు పూలమాలలతో ముంచెత్తారు. గజమాలతో సన్మానించారు. పార్టీ కోసం అంకిత భావంతో పని చేసిన సోమిశెట్టి సేవలను అధినేత, సీఎం చంద్రబాబు గుర్తించి మరోసారి కుడా ఛైర్మన్ పదవి ఇవ్వడం అభినందనీయం అన్నారు.



సోమిశెట్టిని అభినందిస్తున్న నాయకులు



విద్యారంగ సమస్యలపై పోరాటం : ఏఐఎస్ఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న రంగస్వామి

కోడుమూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్య పరిష్కారానికి విద్యార్థులు పోరాటానికి సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో శాస్త్రీయ భావజాలాన్ని పాఠ్య పుస్తకాలల్లో చేర్చడం వలన విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో జీవో నంబర్ 117ను అమలు చేసి అనేక పాఠశాలలు విలీనం చేయడంతో 3,4,5 తరగతులు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు తిష్టవేశాయని, సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం నూతన కమిటీను ఎన్నుకోవడం జరిగింది. ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడుగా వీరేంద్ర, ఉపాధ్యక్షుడుగా సిద్దు, కిషోర్, పులికొండ, కార్యదర్శిగా అల్తాఫ్ సహాయ కార్యదర్శులుగా బాలరామాంజనేయులు, మునిస్వామి, వీరాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరుబాట : సీపీఎం



పాదయాత్ర చేపడుతున్న సీపీఎం నాయకులు

కోడుమూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఎంపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ నారాయణ డిమాండ్ చేశారు. సీపీఎం తలపెట్టిన ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వివిధ వీధుల్లో శనివారం పాదయాత్ర చేపట్టారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల ముందు ఇచ్చిన హామిలను వెంటనే అమలు చేయాలని అన్నారు. తల్లికి వందనం పథకం కింద తల్లి అకౌంట్‌కు రూ.15వేలు, రైతు భరోసా కింద ప్రతి రైతుకు రూ.20వేలు అందించాలన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబునాయుడు ఇప్పుడు ట్రూ అప్ చార్జీలంటూ కరెంటు చార్జీలు పెంచడం ప్రజలను మోసం చేసినట్టేనని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ప్రతి నెల రూ.1500 ఇస్తానని ఇంత వరకు అమలు చేయలేదు. అలాగే కోడుమూరులో సమ్మర్ స్టోరేజ్ నిర్మించి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. మండలంలోని సమస్యలను పరిష్కరించాలని 13వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి 14న తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గఫూర్‌మియా, రాజు, జేపీ వీరన్న, లక్ష్మన్న, మునిస్వామి, శంకర్, బాబు, గిడ్డయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

● కల్లూరు: ఎన్డీఏ కూటమి నాయకులు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలైన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని 26,27 వార్డులు కృష్ణానగర్, న్యూకృష్ణానగర్, తారకరామాకాలనీ, శ్రీరామాకాలనీలో ప్రజాపోరు యాత్రను చేపట్టారు. కార్యక్రమంలో సుధాకరప్ప, ఏసు, హుస్సేన్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

● 26వ వార్డు రైల్వే అండర్‌బ్రిడ్జి కింద మురుగు సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏళ్ల తరబడి ప్రజలను వేదిస్తున్న సమస్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ప్రజల అవస్థలను పరిష్కరించాలన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు

కర్నూలు న్యూసిటీ: కూటమి ప్రభుత్వ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 14 వరకు నిర్వహించే ప్రజాపోరు యాత్ర శనివారం రెండో రోజు నగరంలోని పలు కాలనీలలో ప్రారంభించారు. 17వ వార్డు సప్తగిరి నగర్‌లో జరిగిన కార్యక్రమంలో రామాంజనేయులు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఉచిత ఇసుక అమలుకావడం లేదన్నారు. 14న కలెక్టరేట్ ఎదుట జరిగే ప్రజాపోరు కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. నాగప్ప వీధి ప్రాంతంలో షరీఫ్, 42వ వార్డు చల్లావారి వీధిలో టి.రాముడు, రంగరాజు వీధిలో అబ్దుల్ దేశాయ్ , 26,27 వార్డులలో సీహెచ్.సుధాకరప్ప, సాయిబాబ, తదితరులు పాల్గొన్నారు.

విజయంతో తిరిగి రండి

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో నిర్వహించే సౌత్‌జోన్ సీలంబం ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ చాటి విజయంతో తిరిగి రావాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. డీఎస్ఏ స్టేడియంలో జిల్లా సీలంబం జట్టును పరిచయం చేసుకుని వీడ్కోలు పలికి విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ రాఘవేంద్ర, మహావీర్ ఠాకూర్, క్రీడాభిమాని న్యాయవాది శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలంలో పూజలు



శ్రీశైలం ఆలయం వద్ద గౌరు దంపతులు, గిత్తా, మల్లెల

కల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో గౌరు దంపతులతో పాటు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల జిల్లా అధ్యక్షుడు టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎమ్మెల్యేకు సాదరస్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం గౌరు దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు యశ్వంత్‌రెడ్డి, రాయలసీమ విద్యార్థి విభాగం జేఏసీ చైర్మన్ శ్రీరాములు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై నేడు సదస్సు

కర్నూలు కల్చరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని సాహితీ సదస్సు సంస్థ, తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణపై అయుష్మాన్‌భవ అనే అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు కార్యక్రమ నిర్వాహకురాలు, కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలో మద్దూరునగర్‌లో గల పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కర్నూలు వైద్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జి. భవానీప్రసాద్ వయో వృద్ధులకు ఆరోగ్య సూత్రాలు తెలియజేస్తారని తెలిపారు. సభాధ్యక్షుడిగా గాడిచర్ల ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర వ్యవహరిస్తారని తెలిపారు.

కష్టపడిన వారికి సముచిత స్థానం

● టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర



తుగ్గలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధికి కష్టపడినవారికి సముచిత స్థానం కల్పించారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. శనివారం మాట్లాడుతూ నామినేటెడ్, కార్పొరేషన్ పదవులు వచ్చినవారికి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం చంద్రబాబు పదవులు ఇచ్చారని, పదవులు పొందిన ప్రతి ఒక్కరూ స్వలాభానికి కాకుండా బాధ్యతలను నెరవేరుస్తూ ప్రజలకు సేవలు అందించాలని కోరారు.

సభ్యత్వ నమోదులో ముందుండాలి



మద్దికెరలో సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

మద్దికెర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలు ముందుండాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ పెద్ద వీరన్న అన్నారు. శనివారం స్థానిక మెయిన్ బజారులో సభ్యత్వ నమోదునుడ చేపట్టారు. టైలర్ హరి, మంగళి సోమూ, మంగళి శేఖర్, మదనంతపురం సంజప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు రోజులు విద్యుత్ అంతరాయం

మద్దికెర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎం.అగ్రహారం గ్రామంలో ఈ నెల 11వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మహ్మద్ ఖాన్ తెలిపారు. విద్యుత్ పనులు చేస్తున్నారని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఖాజాబేగ్



వెల్దుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.బోయినపల్లె జడ్పీహెచ్ పాఠశా హిందీ ఉపాధ్యాయుడు ఎస్.ఖాజాబేగ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయన 2018లో ఉమ్మడి కర్నూలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 2000లో గ్రేడ్-2 హిందీ ఉపాధ్యాయుడిగా మంత్రాలయంలో ఆయన విధుల్లో చేరారు. ఈనెల 11వ తేదీన సీఎం చేతుల మీదుగా విజయవాడలో పురస్కారం అందుకోనున్నారు.

వంతెన లేక అవస్థలు

● ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు
● చుట్టూ తిరిగి రావలసి వస్తోందని ఆవేదన



గిరిగిట్ల-అమీనాబాదు మధ్య కూలిన వంతెన

లింగాల వాగుపై వంతెన శనివారం కూలింది. దీంతో పొలాలకు వెళ్లాలన్నా, గ్రామాలకు పోవాలన్నా కి.మీ.లు తిరిగి రావలసి వస్తోంది.

తుగ్గలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిగిట్ల-అమీనాబాదు గ్రామాల మధ్య లింగాల వాగుపై వంతెన శుక్రవారం రాత్రి కూలిపోయింది. వతెన కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వంతెన కూలడంతో అమీనాబాదు, చెన్నంపల్లి, రామలింగాయపల్లి, పగిడిరాయి, కడమకుంట్ల, పగిడిరాయి కొత్తూరు తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొలాలకు వెళ్లాలంటే జొన్నగిరి మీదుగా 20 కి.మీలు ప్రయాణించాల్సి వస్తోంది. ఈ వంతెనపై దాదాపు పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

చుట్టూ తిరిగి రావాలి..



వంతెన కూలడంతో పొలాలకు వెళ్లాలన్నా, గ్రామాలకు చేరుకోవాలంటే చుట్టూ తిరిగిరావాలి. వంతెన లేక 15 కి.మీలు ప్రయాణం చేస్తున్నాం. అధికారులు స్పందించాలి. **- అక్బర్, చెన్నంపల్లి.**

వంతెనను నిర్మిస్తాం



లింగాలవాగుపై వంతెన కూలిపోయింది. ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నాం. వంతెనను నిర్మించడానికి చర్యలు తీసుకుంటాం. **- భరత్ నాయక్, ఆర్డీవో**

యాదవుల అభివృద్ధికి కృషి చేయాలి



నాగరాజు యాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మిద్దె వెంకటేశ్ యాదవ్

తుగ్గలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాదవుల అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ యువ నాయకుడు మిద్దె వెంకటేశ్ యాదవ్ కోరారు. శనివారం తిరుపతిలో యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన నరసింహ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం చంద్రబాబు కష్టపడిన ప్రతి ఒక్కరిని గుర్తించారన్నారు. స్పందించిన ఆయన రాష్ట్రమంతా పర్యటించి, యాదవ కుటుంబాలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో మిల్టన్ గ్రామర్ పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మిల్టన్ గ్రామర్ పాఠశాల 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివార కలిశారు. 30 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో నాడు పాఠశాలలో తరగతి గదిలో చేసిన అల్లర్లను జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులు రామాంజినేయులు, మోహన్, టీవీఎస్ మూర్తి, అశోక్‌ను ఘనంగా సన్మానించారు.

కురువ కార్పొరేషన్ చైర్మన్‌గా మాన్వి దేవేంద్రప్ప



దేవేంద్రప్పను సన్మానిస్తున్న నాయకులు

ఆదోని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ టీడీపీ సీనియర్ నాయకుడు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెద్దహరివాణం మాన్వి దేవేంద్రప్పను సీఎం చంద్రబాబు కురువ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రకటించారు. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఆయన సేవలందించారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అనుచరుడుగా ఉంటూ ఆయన గెలుపుకు కృషి చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆయనను ఎంపిక చేయడంపై కురువలు హర్షం వ్యక్తం చేశారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన మంత్రి టీజీ భరత్, తన రాజకీయ గురువు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఎమ్మెల్యే పార్థసారథికి, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబుకి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎమ్మెల్యేలు జయనాగేశ్వర్ రెడ్డి, దస్తగిరి, ఆలూరు, మంత్రాలయం ఇన్‌చార్జిలు వీరభద్ర గౌడ్, రాఘవేంద్ర రెడ్డికు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన విద్య, భోజనం అందాలి

● ఆర్డీవో భరత్ నాయక్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ నాయక్

తుగ్గలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని ఆర్డీవో భరత్ నాయక్ ఆదేశించారు. శనివారం కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. వంట మనుషులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా, ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారని విద్యార్థినులను అడిగి తెలుసు కున్నారు. ప్రత్యేకాధికారి షాహీన్, డీటీ నాగరాజు ఉన్నారు.

త్వరలోనే దుకాణాల వేలాలు: డీఎల్‌పీవో

● సిండికేట్‌కు అవకాశం ఇవ్వం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆలూరులో రూ.1.20 కోట్లతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలకు త్వరలో బహిరంగ వేలం నిర్వహిస్తామని పత్తికొండ డివిజన్ పంచాయతీ అధికారి వీరభద్రప్ప తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో "నిర్మించారు.. ప్రారంభించరా" శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. కొన్ని కారణాలతో వేలం వాయిదా పడిందని, నిర్వహించేం దుకు ప్రణాళిక రూపిందిస్తామన్నారు. దుకాణాల వేలం విషయం డీపీవో భాస్కర్ దృష్టిలో ఉందని, ఆయన స్వయంగా వచ్చి పరిశీలించినట్లు తెలిపారు.

ఓటరు నమోదును వినియోగించుకోవాలి

పత్తికొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఓటు నమోదు చేసుకోవాలని ఆర్డీవో భరత్‌నాయక్ సూచించారు. శనివారం పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాలలో ఓటరు నమోదును ఆయన పరిశీలించారు. ఈనెల 23, 24 తేదీల్లో కూడా ప్రత్యేక ఓటరు నమోదు ఉంటుందన్నారు.

ఓటు హక్కు కల్పించాలి

తుగ్గలి: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని పత్తికొండ ఆర్డీవో భరత్ కుమార్ నాయక్ ఆదేశించారు. శనివారం తుగ్గలిలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని పరిశీలించారు. ఆదివారం కూడా ఓటు నమోదు చేసుకోవచ్చని అన్నారు. డీటీ నాగరాజు, వీఆర్వో నవీన్‌పటేల్ రెడ్డి ఉన్నారు.

మరణించిన వారి పేర్లను తొలగించండి

మద్దికెర: మరణించిన, గ్రామం వదలివెళ్లిన వారి పేర్లను ఓటరు జాబితానుంచి తొలగించాలని ఆర్డీవో భరత్ నాయక్ ఆదేశించారు. శనివారం ఎం.అగ్రహారం పోలింగ్‌బూత్‌ను పరిశీలించారు. తహసీల్దార్ హుశేన్‌సాహెబ్, ఆర్ఐ రవికుమార్, వీఆర్వోలు రంగస్వామి, మల్లికార్జున, తదితరులు ఉన్నారు.



మద్దికెరలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్ నాయక్

అభివృద్ధికి సహకరించాలి



బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్

ఆలూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి సహకరించాలని అరికేర సర్పంచి కుప్పగల్లు నాగరాజు కోరారు. శనివారం ఎన్టీఆర్ కాలనీలో నూతన బోరును ప్రారంభించారు. ఏన్నో ఏళ్ల నుంచి వేధిస్తున్న సమస్యను ప్రభుత్వం పరిష్కరించిందని తెలిపారు. గోవింద్, ఆనంద్, మల్లప్ప, వీరేశ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ధ్యేయం

మద్దికెర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ జి.శ్రీనివాసులు, తెలుగు యువత నాయకుడు బసినేపల్లి హరినాథ్‌గౌడ్ అన్నారు. శనివారం బసినేపల్లి గ్రామంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

బ్యాంకు రుణం తీర్చలేక రైతు ఆత్మహత్య



రైతు గిరిబాబు మృతదేహం

క్రిష్ణగిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోగర్చేడు గ్రామానికి చెందిన మాదిగ గిరిబాబు (46) ఉరి వేసుకొని శుక్రవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన మేరకు.. గిరిబాబుకు 7.60 ఎకరాల పొలం ఉంది. పొలంపై డోన్ కేడీసీసీ బ్యాంక్‌లో రూ.15 లక్షల రుణం తీసుకుని, చెల్లించక పోవడంతో బ్యాంకు అధికారులు నోటీసు పంపారు. తన పొలం పోతుందన్న దిగులుతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. భార్య చుట్టుపక్కల వాళ్ళ సాయంతో వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినాడని వైద్యులు తెలిపారు. భార్య మేరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి నలుగురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా సావిత్రి



ఆదోని టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది సావిత్రికి రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి లభించింది. ఆమె పార్టీలో దాదాపు 2018 నుంచి పనిచేస్తూ ఉంది. తనకు పదవి కేటించినందుకు సీఎం చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరు నమోదును వినియోగించుకోండి

● సబ్ కలెక్టర్



ఆర్ట్స్ కళాశాలలో పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ భరద్వాజ్

ఆదోని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలు ప్రత్యేక ఓటరు నమోదును వినియోగించుకోవాలని ఆదోని ఎన్నికలు అధికారి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. శనివారం ఆర్ట్స్ కళాశాల, సాయి కళాశాల, ఎస్సీ హాస్టల్, మదిరే గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచిం చారు. ఓటర్లు మార్పులు, చేర్పులు కూడా చేసుకోవచ్చని సబ్ కలెక్టర్ తెలిపారు.

కూటమి బీసీల పక్షపాతి



చైర్మన్లు దేవేంద్రప్ప, సావిత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఆదోని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బీసీల పక్షపాతి అని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రిని సన్మానించారు. ఆదోనివారికి చైర్మన్ పదవులు రావడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని, కూటమి అలా చేయదన్నారు. జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, విట్టా రమేష్, నాగరాజు గౌడ్, కునిగిరి నీలకంఠ, ఫక్రుద్దీన్, గుడిసె కృష్ణమ్మ పాల్గొన్నారు.

కూలీల వలసబాట



తెలంగాణకు వలస వెళ్తున్న కూలీలు

అస్పరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులు ముగియవడంతో వ్యవసాయ కూలీలు తెలంగాణలోని పత్తి తీత పనులకు వలస వెళ్తున్నారు. రోజూ వెయ్యి మంది దాకా తెలంగాణకు వలస వెళుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలు అంతంత మాత్రమే పండటంతో వారికి దిక్కుతోచలేదు. తెలంగాణలోని అదిలాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, కర్ణాటకలోని రాయచూర్, కోస్తాంధ్రలోని గుంటూరు, నెల్లూరు ప్రాంతాలకు తరలి వెళుతున్నారు. ఉపాధి పనులు లేక వలస వెళ్లక తప్పలేదని కూలీలు అంటున్నారు.

ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● ఎస్ఐ వెంకట నరసింహులు



ఆలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పిస్తామని ఆలూరు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజలకు, వాహనదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: పేకాట నియంత్రణ చర్యలు?

జవాబు: రెండు నెలల్లో దాదాపుగా 50 మంది పేకాట రాయుళ్ళని అరెస్టు చేశాం. మట్కా, సారా నిర్వహణపై సమాచారమిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

ప్రశ్న: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ఏ చర్యలు తీసుకున్నారు?

జవాబు: అరికెర రోడ్డు, అంబేడ్కర్ కూడలిలో అధికంగా ట్రాఫిక్ ఉంటుంది. ఇద్దరు కానిస్టేబుళ్లను ఏర్పాటు చేశాం.

ప్రశ్న: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కుంచుకుంటున్నారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: రిమితికి మించి ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గుర్తించి ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

అంగన్‌వాడీ కార్యకర్తలకు మెమోలు

పెద్దకడబూరు, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తారాపురం, నౌలేకల్ గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీల కార్యకర్తలకు శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీరగోవిందమ్మ మెమోలు జారీ చేశారు. శనివారం అంతా మా ఇష్టం, పనివేళలు పాటించని అంగన్‌వాడీ కార్యకర్తలు అని 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఇందుకు స్పందించిన ఐసీడీఎస్ అధికారులు కార్యకర్తలకు మెమోలు జారీ చేశారు.

సీఎంను కలిసిన టీడీపీ నాయకుడు



చంద్రబాబును కలసిన టీడీపీ నాయకుడు గంగవరం ఖాజా

నందవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబును నందవరం మండలం గంగవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఖాజా మాట్లాడుతూ 2009 వచ్చిన వరదల్లో తుంగభద్ర తీర గ్రామాలైన నదికైరవాడి, గంగవరం, చిన్నకొత్తిలి, పెద్దకొత్తిలి, నాగలదిన్నె, గురుజాల, రాయచోటి తదితర గ్రామాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరిన్ని నిధులు ఇచ్చి ఆదుకోవాలని సీఎంను కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్వో చిరంజీవి


పెద్దకడబూరు, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆర్వో చిరంజీవి పరిశీలించారు. బీఎల్‌వోలు ఓటరు నమోదులో నిర్లక్ష్యం వహించొద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనాథ్, వీఆర్‌వో విక్రమ్ రెడ్డి, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సెమీ ఫైనల్‌లో హాకీ కర్నూలు జట్టు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం అనకాపల్లి జిల్లాలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14 హాకీ టోర్నమెంటులో కర్నూలు జిల్లా జట్టు సెమీ ఫైనల్‌కు చేరిందని హాకీ కర్నూలు కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్ దాసరి సుధీర్, ఈరన్న, రామన్న తెలిపారు. క్వాటర్ ఫైనల్‌లో గుంటూరుపై 2-0 స్కోరుతో విజయం సాధించింది. ఈ విజయం పట్ల కర్నూలు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ గిడ్డయ్య తెలిపారు.

నేలకు పచ్చని అందాలు

● వరి పంటతో ప్రకృతి పులకింత
● గాజులదిన్నె పరిసరాల్లో సాగైన పొలాలు



గోనెగండ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టు దిగువ ప్రాంతం, హెచ్ కైరవాడి, గాజులదిన్నె, పుట్టపాశం, వేముగోడు, పరిసర గ్రామాలు వరి పంట పచ్చదనంలో పులకిస్తున్నాయి. సాయంత్రం సూర్యాస్తమయ సమయంలో వరి పొలాలు ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. చుట్టూ నీరు.. పచ్చని పైర్లు..పొలాల మధ్య ఒంపులు తిరిగిన కాలి బాటలు సుందరమయంగా కనువిందు చేస్తున్నాయి.అలాగే ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల వెంట వరి సాగు చేసిన పంట పొలాలు ఎంతో అందంగా ఉన్నాయి. సాయంత్రం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వాకింగ్‌కు వచ్చి సూర్యస్తమయం వరకు అక్కడే ఉండి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నారు.

'తల్లికి వందనం' తక్షణమే అందించాలి



అగ్రహారంలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గోనెగండ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం' డబ్బులను విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమా చేయాలని సీపీఎం నాయకులు నరసింహులు, గిరిరాజు డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు గోనెగండ్ల మండలంలోని అగ్రహారం గ్రామంలో పర్యటించారు. ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలో పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఈ నెల 15న గోనెగండ్ల ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపట్టే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్దయ్య, రమేష్, బాబు, ఫకృద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, బంగారప్ప వెంకటేష్, రంగస్వామి, గోవిందు, పరమేష్, హనుమంతరెడ్డి, తిమ్మారెడ్డి, రామిరెడ్డి, లక్ష్మన్న, చిన్న హనుమంతు, దిగ్గెన్నె పాల్గొన్నారు.

మంత్రాలయంలో భక్తుల సందడి



మంత్రాలయం మఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. రెండో శని, ఆదివారం సెలవు దినాలు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నదితీరం, ఆర్‌టీసీ బస్‌స్టాండ్ ప్రాంతం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు వివిధ రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని, కార్తీక దీపాలను భక్తిశ్రద్ధలతో వెలిగించి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కన్నడ నటుడు



మంత్రాలయంలో మఠం అధికారులతో సినీ నటుడు ధనుంజయ

మంత్రాలయం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామిని కన్నడ సినీ నటుడు ధాలి ధనుంజయ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు మఠం జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు. ధనుంజయతో అభిమానులు ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. ఆయన వెంట మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషి, అనంత పురాణిక్, వ్యాసరాజ్ ఆచార్, సూపరింటెండెంట్ జేపీ స్వామి, జయతీర్థఆచార్, బిందు మాధవ్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ ఆచార్ ఉన్నారు.

30 శాతం నిధులు కేటాయించాలి

● ప్రాథమిక పాఠశాలలను మూసివేయరాదు
● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలలను మూసివేయరాదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గూడూరులో యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన జరిగిన స్వర్ణోత్సవ మహాసభలను ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల కాలంలో విద్యను ప్రైవేటీకరించే దిశగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ప్రైవేటీకరణను తప్పనిసరిగా ఉపాధ్యాయులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు గూడూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభా ప్రాంగణంలో జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్, నగర పంచాయతీ మాజీ వైస్ ఛైర్‌పర్సన్ ఇందిరా సుభాషిణి, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, నాయకులు పాల్గొన్నారు

సీఐ బదిలీపై రాస్తారోకో



పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ సీఐ సుదర్శన రెడ్డి బదిలీని నిలిపివేయాలని ప్రజా,విద్యార్థి సంఘాలు కోరారు. సీఐల బదిలీల్లో భాగంగా ఎమ్మిగనూరు అర్బన్‌కు కర్నూలు పనిచేస్తున్న సీఐ శ్రీనివాసులును నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావటంతో ఇక్కడ పనిచేస్తున్న సీఐ సుదర్శనరెడ్డిని మరోచోటికి బదిలీ చేస్తున్నారని తెలుసుకున్న ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు శనివారం ఆందోళన చేపట్టారు. ముందుగా పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించి, అటు తరువాత డీఎస్పీ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సీఐ సుదర్శన రెడ్డి బదిలీని నిలిపివేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బతకన్న, కామళే గణేష్, సత్యనారాయణరెడ్డి, ఆనంద్ చైతన్య దేవదానం, ఏసేపు, మాల నరసన్న, సంజీవ్, రామచంద్ర, చార్లెస్, నరసన్న, విద్యార్థి సంఘాల నాయకులు రాజేష్ మహేంద్ర, రంగస్వామి, అజీత్, ఆయా ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా పోరుకు సిద్ధం కావాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికై సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరుకు సిద్ధం కావాలని సీపీఎం నాయకులు గోవిందు, రాముడు, కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో ప్రజా పోరు పేరుతో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ మూడునెలల్లో కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు తగ్గిస్తామని చెప్పి నేడు మౌనం దాల్చారని విమర్శించారు. ప్రీపెయిడ్ మీటర్లను బిగించడాన్ని మానుకోవాలన్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం ధరల తగ్గింపుపై దృష్టి సారించటంతోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఉస్మాన్ వలి, లక్ష్మన్న, శేఖర్, పరమేష్, మోహిన్, చంద్ర, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో విస్తృత సోదాలు



మంత్రాలయంలో తనిఖీలలు చేస్తున్న ఎస్‌ఐ పరమేష్ నాయక్, సిబ్బంది

మంత్రాలయం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో మద్యం కనిపిస్తే.. కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని సీఐ రామాంజులు, ఎస్‌ఐ పరమేష్‌నాయక్ హెచ్చరించారు. మంత్రాలయంలో బెల్టు షాపులను తొలగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తెలుగుతమ్ముళ్ల ర్యాలీ, ధర్నా చేశారు. దాంతో శనివారం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి రాఘవేంద్రపురం, రామచంద్రనగర్, ఓల్డ్‌టౌన్, నది తీరం లాడ్జీ ఏరియా, సుజీంద్రనగర్, తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. అనుమానమున్న ప్రతి స్థలాన్ని పరిశీలించి గతంలో కర్ణాటక మద్యం అమ్మేవారిని బైండోవర్ చేశారు. పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



మంత్రాలయంలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఈఆర్‌వో చిరంజీవి

మంత్రాలయం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఈఆర్‌వో చిరంజీవి హెచ్చరించారు. శనివారం మంత్రాలయం, కల్లుదేవకుంట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయని బీఎల్‌వోలను అడిగి తెలుసున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 237 పోలింగ్ కేంద్రాల్లో 196 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రత్యేక పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎస్ రవి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు జీకే గురురాజరావు, సూపర్‌వైజర్లు సరస్వతమ్మ, ఆదాం, నూర్ అహ్మద్, ఆర్పీ భీమన్నగౌడు, భీమయ్య, ఆనంద్, నర్సప్ప, శ్వేత, ప్రభాకర్, రాజు, పంపాపతి పాల్గొన్నారు.

15న మంత్రాలయంలో తుంగా హారతి

● లక్ష దీపోత్సవం, తుంగా నదిలో తెప్పోత్సవం
● ఏర్పాట్లు చేస్తున్న శ్రీమఠం అధికారులు



మంత్రాలయం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో ఈ నెల 15న తుంగాహారతి, లక్ష దీపోత్సవం, నదిలో తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో తుంగానది ఒడ్డున వీఐపీ ఘాట్ వద్ద ప్రత్యేక వేదికపై ప్రహ్లాదరాయల పూజ, తుంగాహారతులు, లక్ష దీపాలు, భక్తులను ఆకట్టుకునే విధంగా తెప్పోత్సవం కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే లక్ష దీపాలను సిద్ధం చేస్తున్నామని, నదిఒడ్డున వేదిక, బారికేడ్లు, విద్యుద్దీపాలంకరణకు ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈలు బద్రినాథ్, శ్రీహరి దగ్గరుండి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే తుంగా హారతి మహోత్సవానికి దేశం నలుమూలల నుంచి అధికసంఖ్యలో తరలి వచ్చే భక్తులకు తగిన ఏర్పాటు చేస్తున్నారు.